క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధంగా రక్షిత మంచినీటి పథకం


రామానుజులపేటలో పూర్తయిన తాగునీటి ట్యాంకు నిర్మాణం

రాజాం: మండలంలోని రామానుజులపేట గ్రామంలో కొత్తగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మాణం ప్రారంభానికి సిద్ధమైంది. గ్రామస్తుల తాగునీటి సౌకర్యార్థం రూ.17 లక్షల అంచనా వ్యయంతో 15 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంకు నిర్మించామన్నారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లతో బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డీవార్మింగ్ డే వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యుడు ఎస్.చలమయ్య మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన డీవార్మింగ్ డే సందర్భంగా ఈ వాల్‌పోస్టర్ విడుదల చేశామని, అన్ని ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు శుక్రవారం వేస్తామన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు కలిసి ఈ కార్యక్రమాన్ని సక్రమంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రాధాకృష్ణ, పీహెచ్ఎన్ సావిత్రి, సూపర్‌వైజర్లు సాయికృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి భక్తుల సేవాభావం


గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న సత్యసాయి భక్తులు

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి వస్తున్న గర్భిణులకు రేగిడి సత్యసాయి భజన మండలి సభ్యులు ప్రేమామృత ప్రసాద సేవ కార్యక్రమం పేరిట అన్నదానం చేస్తున్నారు. ప్రతీ గురువారం ఆస్పత్రికి వస్తున్న గర్భిణులందరికీ దాతల సహకారంతో పౌష్టికాహారం అందిస్తూ సేవాభావం చాటుకుంటున్నారు. మధ్యాహ్నం శీమకుర్తి ప్రసాదరావు, శారదలు సమకూర్చిన ఆహారాన్ని 60 మంది గర్భిణులకు అందించడమే కాకుండా మరో 20 మందికి నారాయణసేవ కూడా నిర్వహించారు. సత్యసాయిబాబా చూపిన సేవా మార్గాన్ని భక్తులు కూడా అనుసరిస్తుండడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

సకాలంలో రుణాలు చెల్లించేలా చర్యలు

రేగిడి: స్వయం సహాయక సంఘాల మహిళలంతా సకాలంలో స్త్రీనిధి రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక వైకేపీ(వైఎస్సార్ క్రాంతి పథం) కార్యాలయంలో వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన ప్రతీ గ్రామంలో రుణాలు తీసుకున్న మహిళలంతా సమావేశాలు ఏర్పాటు చేసుకుని, క్రమం తప్పకుండా రుణాలు చెల్లించేలా తీర్మానాలు చేయించాలన్నారు. ఎప్పటికప్పుడు రుణాలు చెల్లిస్తేనే కొత్తవారికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని, తద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బి.గోవిందరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుభాషిణి, సీసీలు, సీఎఫ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, పీడీ వెంకటనాయుడు

బొబ్బిలి: కడపలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు సుప్రియ, తేజస్విని, చైతన్యలను ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, పీడీ వెంకటనాయుడు గురువారం అభినందించారు. మండలంలోని పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వీరు ఈ నెల 22వ తేదీ నుంచి గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలి

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్


కందిశ గ్రామస్తులతో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రేగిడి: ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించి, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. మండలంలోని సరసనాపల్లి, జోడిబందల, కందిశ, మీసాలపేట, ఎం.డోలపేట, తునివాడ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి, నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అలాగే ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులంతా పాలన బాగుందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారికి చేసిన మంచిని సంతోషంగా తెలిపారు. అనంతరం పలువురు పార్టీ నేతలు, పలు సంఘాల పెద్దలను కలిసి, తనకు మద్దతు ఇవ్వాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో సీఎం జగనన్న ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు బాగుపడిన తీరును క్షేత్రస్థాయిలోకి వెళ్లి, తెలియజేయాలన్నారు. ప్రతీ లబ్ధిదారుని ఓటు పార్టీకి పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్‌కుమార్, రేగిడి, సంకిలి సొసైటీల అధ్యక్షులు వంజరాపు అశోక్, లావేటి వెంకటవేణుగోపాలనాయుడు, సర్పంచ్‌లు కర్రి అప్పలనాయుడు, కెల్ల మన్మధరావు, కెంబూరి వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, గార రమణ, బుగత కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు పూటలు పనిచేస్తే రూ.270


వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో సాయిరాం

రాజాం: ఉపాధి హామీ పథకం వేతనదారులంతా రెండు పూటలా పనిచేయాలని ఏపీవో కె.సాయిరాం సూచించారు. మండలంలోని గుయ్యానవలస గ్రామంలో సాగునీటి చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన గురువారం పరిశీలించారు. మస్తర్లు తనిఖీ చేసి, జాబ్‌కార్డు ఉన్న వారిని మాత్రమే పనులకు అనుమతించాలని తెలిపారు. వేతనదారులు రెండు పూటలా పనిచేస్తేనే రోజువారీ కనీస వేతనం రూ.270 వస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ భవాని తదితరులు పాల్గొన్నారు.

హరిత బొబ్బిలికి ప్రాధాన్యమివ్వండి


మున్సిపల్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి: పట్టణంలో విస్తారంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి, హరిత బొబ్బిలికి ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిని గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌ను వారు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందించి, అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, కోశాధికారి వి.ఎస్.శర్మ, సభ్యులు కృష్ణదాస్, మహేష్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ


ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి దిలీప్‌కుమార్

రామభద్రపురం: రెండేళ్ల నుంచి 19 ఏళ్ల వయసు వారిలో నులిపురుగుల నివారణకు శుక్రవారం మాత్రలు పంపిణీ చేయనున్నట్లు రామభద్రపురం, ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పి.దిలీప్‌కుమార్, బి.రత్నదీప్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో వారు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకటి నుంచి రెండేళ్ల వయసు లోపు పిల్లలకు అర్ధమాత్ర, 2 నుంచి 19 ఏళ్ల లోపు వయసు వారికి 400 ఎంజీ మాత్రను మధ్యాహ్నం భోజనం తర్వాత ఇవ్వనున్నామన్నారు. మాత్ర మింగిన తర్వాత పిల్లలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీని సంప్రదించాలన్నారు. అంతకుముందు శిబిరానికి హాజరైన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

16న బంద్

బొబ్బిలి: ప్రధాని మోదీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన చేపట్టే బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు కోరారు. ఇదే విషయమై గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన బంద్‌లో భాగంగా కార్పొరేట్‌కు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజానీకం అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేలా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టనున్నామన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకరరావు

రాజాం సిటీ: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో శంకరరావు గురువారం సమీక్షించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన 15వ ఆర్థికసంఘం నిధుల వినియోగం, 2024–25 జీపీడీపీ ప్లాన్ తయారీ, వివరాలు అప్‌లోడ్ చేయడంపై పలు సూచనలు చేశారు. అలాగే గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్లు, కులగణన వేగవంతం, శానిటేషన్, ఇతర అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు

బాడంగి: ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశమైన ఆయన ఏయే గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకం కింద కుళాయిలు, పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉందో అంచనాలు రూపొందించి, నివేదిక సమర్పించాలన్నారు. గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేసి, బ్లీచింగ్ చల్లాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణం పరిశుభ్రంగా ఉండాలి


కొత్తమొక్కలు నాటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: స్థానిక పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పట్టణంలోని వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. గురువారం పట్టణంలోని పలు వ్యాపార సంస్థలతో పాటు హోటళ్లు, టీ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రధానరోడ్డులో ఫుట్‌పాత్‌లు దాటి, రోడ్డుమీద వ్యాపారాలు కొనసాగించవద్దన్నారు. అనంతరం రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులు, చెత్త తరలించే వాహనాలు, ప్రధాన రోడ్డులో నాటిన మొక్కలను పరిశీలించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ నాగరాజు, ఏఈ వెంకట్, ఆర్ఐ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో బొబ్బిలి వాణి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నియోజకవర్గ సమస్యలను వినిపించారు. తెర్లాం మండలం లోచర్ల, బొబ్బిలి మండలం రాముడు వలస గ్రామాల సాగుభూములకు ఆధారమైన తోటపల్లి ఎత్తిపోతల పథకం పూర్తిచేయకుండానే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించేశారన్నారు. పథకం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే, బాడంగి మండలం గొల్లాది–బొబ్బిలి మధ్య వేగావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. భూముల రీసర్వేలో నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో తలెత్తిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

నేడు తెంటువలసలో జగనన్న ఆరోగ్య సురక్ష

బాడంగి: మండలంలోని తెంటువలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వాడాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆదిత్య ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. శిబిరానికి వచ్చే వారికి ఉచితంగా ఆరోగ్య తనిఖీలు చేసి, మందులు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే శస్త్రచికిత్స, మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

19 మద్యంసీసాలు స్వాధీనం

వంగర: మండలంలోని నీలయ్యవలస, బాగెంపేట గ్రామాల సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 19 మద్యంసీసాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, శ్రీహరిపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జనార్దన్ తెలిపారు.

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి అక్రమంగా విక్రయిస్తున్న 16 మద్యం సీసాలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ కొండలరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేశామన్నారు.

కారుణ్య నియామకపత్రం అందజేత


నియామకపత్రం అందజేస్తున్న మురళీకృష్ణారావు

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అజీమ్ ఖాన్ అనే వ్యక్తికి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు చేతులమీదుగా కారుణ్య నియామకపత్రం గురువారం అందజేశారు. సదరు వ్యక్తికి కారుణ్య నియామకం కింద జూనియర్ అకౌంటెంట్ పోస్టు కల్పించినట్లు మున్సిపల్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సన్‌రైజ్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు

రాజాం: పట్టణంలో కొత్తగా ప్రారంభించిన సన్‌రైజ్ ఆస్పత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభమయ్యాయి. 6 నెలల క్రితం ఈ ఆస్పత్రిని ప్రారంభించామని, ఆరోగ్యశ్రీ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పుడు అప్రూవల్ వచ్చిందని ఆస్పత్రి ఎండీ డాక్టర్ మాధవీలత తెలిపారు. ఆస్పత్రికి వచ్చే బాధితులకు సకాలంలో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తామన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామంలో ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేసి, ప్రభుత్వం ఈ కార్డు ద్వారా కల్పిస్తున్న సదుపాయాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎస్.రఘునాథాచారి తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులను పూర్తి చేయండి


మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పూర్తి చేయండి అని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని బాలకవివలస గ్రామ ప్రభుత్వ పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ఈ క్రమంలో నిర్మాణ దశలోని మరుగుదొడ్లను త్వరితగతిన నిర్మించి, వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరానికి ఏ పాఠశాలలోనూ పెండింగ్ పనులు ఉండకూడదన్నారు. ఆయన వెంట ఎస్ఎంసీ చైర్మన్ శాసపు అప్పలనాయుడు, సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు శాసపు హైమావతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


బుర్రకథ ప్రదర్శన ద్వారా బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బాడంగి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి కోరారు. మండలంలోని గొల్లాది గ్రామంలో కళాజాతా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల్యవివాహాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం తీసుకునే చట్టపరమైన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నవయసులో పెళ్లిళ్లు చేయడం ద్వారా ఎంతోమంది జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. దీనికి చిన్నవయసు, ఆ దశలో ఒకరినొకరు అర్థం చేసుకోవడంలో లోపమేనన్నారు. చిన్నవయసులో గర్భం దాలిస్తే ప్రసవం కష్టతరమై, ఒక్కోసారి తల్లీబిడ్డ, లేకపోతే ఇద్దరిలో ఏ ఒక్కరైనా మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం బాల్యవివాహాలు విడనాడాలన్నారు.

సన్మానం


రాజాం సిటీ: సన్మాన గ్రహీతలతో ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజాం సిటీ: క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ఇటీవల ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించిన పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులను గురువారం ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు దుశ్శాలువ, మెమొంటోలు అందజేసి, సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలోని క్రీడాకారుల్లోని క్రీడానైపుణ్యాలను వెలికితీసే గొప్ప కార్యక్రమం ఆడుదాం ఆంధ్రా అని, ఈ పోటీల ద్వారా ఎంతోమందికి క్రీడల పట్ల ఆసక్తి పెరిగిందన్నారు. క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించడంలో పీఈటీలు కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నారావు, ఎంపీడీవో బాసూరి శంకరరావు, మున్సిపల్ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, ఎంఈవో వై.దుర్గారావు, ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యనారాయణ, ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


రాజాం: మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు

రాజాం: మున్సిపల్ కమిషనర్‌గా సేవలందించి, బదిలీపై గుడివాడ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన డీటీవీ కృష్ణారావును స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజాం పట్టణాన్ని కృష్ణారావు ఎంతో అభివృద్ధి చేశారని, వైఎస్సార్ పార్కు, చిల్డ్రన్ పార్కులను ఆహ్లాదకరంగా, సుందరంగా తీర్చిదిద్దారన్నారు. అలాగే అన్నివార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేసి, రాజాం పట్టణ పరిశుభ్రతకు పాటుపడ్డారన్నారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అనంతరం ఇక్కడకు కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడును సన్మానించారు. కార్యక్రమంలో రాజాం మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఏఈ వెంకట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, ఆర్ఐ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పథకాలపై అవగాహన


వంగర: బుర్రకథ రూపంలో ఐసీడీఎస్ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కళాకారులు

వంగర: మండలంలోని అరసాడ గ్రామంలో శ్రీరామజ్యోతి బుర్రకథ దళం ప్రదర్శనల ద్వారా ఐసీడీఎస్ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై గురువారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ విధానం, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం వంటి సదుపాయాలను కళాకారులు గేయాలు, ప్రదర్శనల ద్వారా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ కల్యాణి, ఏపీఎంలు మీసాల చక్రపాణి, టి.మంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న బొబ్బిలి సీఐ తిరుమలరావు

బాడంగి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బొబ్బిలి సీఐ ఎస్.తిరుమలరావు గురువారం సందర్శించారు. ఇదే పాఠశాలలోని 184, 185, 186 పోలింగ్‌బూత్‌లను చూసి, అందులో మౌలిక సదుపాయాలు ఉన్నవీ లేనివీ గమనించారు. ఆయన వెంట ఏఎస్ఐ డి.కొండలరావు, ప్రిన్సిపాల్ టి.రామదాస్ తదితరులు పాల్గొన్నారు.